క్లుప్తంగా

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండపైనున్న శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గుహాలయంలో శనివారం శ్రీ సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం గవ్యాంత పూజలు, పీఠపూజ, రత్నన్యాసం జరిగాయి. అనంతరం పుణ్య దంపతులు కలశాలతో వెళ్లి విగ్రహ ప్రతిష్ఠలు నిర్వహించారు. పుల్లేటికుర్తి భోగేశ్వరశర్మ శిష్య బృందం ఆధ్వర్యంలో కొండ ప్రాంతం వేద మంత్రాలతో మారుమోగింది. కుంభాభిషేకం అనంతరం మహాపూర్ణాహుతి శాంతి కల్యాణం నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు, అన్నసంతర్పణ చేశారు.

నేడు ఈడుపుగల్లులో ఉచిత వైద్య శిబిరం

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామ పంచాయతీలో ఈనెల 19న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఈఓ బి.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్షత్ చెవి, ముక్కు, గొంతు, చిన్న పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడవద్దంటూ ర్యాలీ



ముస్తాబాదలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: వస్త్రంతో తయారు చేసిన సంచులు, జ్యూట్ బ్యాగ్‌లు మాత్రమే ప్రజలు వినియోగించాలని కోరుతూ ముస్తాబాదలో శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్ అసోసియేషన్ సింగ్ నగర్ డివిజన్ పిలుపు మేరకు స్థానిక నవభారత్ హైస్కూల్ విద్యార్థులు క్యారీ బ్యాగులు వాడవద్దంటూ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. కరస్పాండెంట్ షేక్ ఇమాం మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు భూమిలో కరగడానికి పదిలక్షల సంవత్సరాలు పడుతుందని, దీని కారణంగా భూమి పాడైపోతుందని చెప్పారు. అందుకే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను అందరూ దూరం పెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా, ఉపాధ్యాయులు హసీనా, దస్తగిరి, రామభద్రరాజు, జయశ్రీ, అశోక్ రాణి, సునీత, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. ఆత్కూరు గ్రామ సచివాలయం ఆవరణలో బ్రైట్ లైట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మోత్రు శశి జ్ఞాపకార్థం తండ్రి నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు చికిత్స చేయించుకోవాలని అన్నారు. అనంతరం కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాల సుడిలో అపరాల రైతు

- తడిసిన మినుము, పెసర పంటలు
- ఆందోళనలో రైతులు



కంకిపాడు మండలం గొల్లగూడెంలో తడిసిన మినుము పనలు

కంకిపాడు: ఈ ఏడాది వాతావరణం అనుకూలించి, పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. మార్కెట్‌లో ధర కూడా ఆశించిన మేర ఉండటంతో అపరాల రైతులు ఆనందంతో ఉన్న తరుణంలో వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పుతో రైతుల ఆశలు తలకిందులయ్యాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి దక్కే స్థితిలో ప్రకృతి కన్నెర్ర చేసింది. అకాల వర్షం రూపంలో రైతుల ఆశలను నీరుగార్చింది.

ద్రోణి ప్రభావంతో మోస్తరు వర్షాలు

కోస్తాంధ్రపై ఏర్పడ్డ ద్రోణి ప్రభావంతో గురువారం రాత్రి నుంచి మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం కూడా పలు దఫాలుగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఈదురుగాలులు వీచాయి. వాతావరణం మేఘావృతమై కారుమబ్బులు కమ్మాయి. వర్షానికి తోడు తీవ్రమైన చలిగాలులు వీచాయి. వాతావరణంలో ఏర్పడ్డ ఈ మార్పులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

2,800 ఎకరాల్లో తడిసిన అపరాల పంట

ద్రోణి ప్రభావంతో అకాల వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సాగులో ఉన్న రెండు వేల ఎకరాల్లో మినుము పంట, 750 ఎకరాల్లో పెసర పంట తడిచింది. తీత పనులు పూర్తి చేసి గూళ్లు వేసి నూర్పిడికి సిద్ధం చేసిన పొలాల్లో పనల మీద ఉన్న పంట వర్షానికి తడిసింది. నిన్నటి వరకూ ఎండిపోయిన పనలు ఒక్కసారిగా వర్షం పడటంతో మినుము, పెసర కాయలు పగిలి గింజలు వృథాగా పోయే అవకాశం ఉందని, తేమ ఎక్కువగా ఉండటంతో కాయలు బూజు పట్టి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పడుతున్న వర్షాలతో



ఉయ్యూరులో విద్యుత్ వైర్లపై పడిన చెట్లు

రైతులు పంట నష్టపోకుండా గూళ్లపై పరదాలు కప్పి పంటను సంరక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్‌ను 'సాక్షి' వివరణ కోరగా, ఎడతెరపి లేకుండా వర్షం కురిస్తే పంటకు నష్టం ఉండదని, వాతావరణం తెరపివ్వగానే పనలు ఆరబెట్టుకుంటే నష్టాన్ని అధిగమించొచ్చన్నారు. ఆదివారం నుంచి వీఏఏలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమికంగా పంటకు జరిగిన నష్టాలను అంచనా వేస్తారని వివరించారు.

నేలకూలిన చెట్లు

ఉయ్యూరు: ఈదురుగాలులతో కూడిన అకాలవర్షానికి ఉయ్యూరులో చెట్లు నేలకూలాయి. శనివారం పట్టణంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు బలంగా వీచాయి. గాలులకు పట్టణంలోని కాలేజ్ రోడ్డు, చెరుకు పరిశోధనా స్థానం, దుర్గా ఎస్టేట్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. ఆయా చోట్ల చెట్లు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు సిబ్బందితో వర్ష ప్రభావ ప్రాంతాల్లో పర్యటించి చెట్లను తొలగింపచేశారు. విద్యుత్ అధికారులను సమన్వయం చేసుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. వర్షానికి పలు గ్రామాల్లో పంట పొలాల్లో గూళ్లుగా ఉన్న మినుము పైరు తడిచింది. రైతులు పరదాలు కప్పి పంట సంరక్షణ చర్యలు తీసుకున్నారు.

ఫెన్సింగ్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే సాయం



నగదును అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

గన్నవరం: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వెళ్తున్న గన్నవరానికి చెందిన ధనియాల నాగప్రత్యూషకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో శనివారం నాగప్రత్యూష తండ్రి నాగరాజుకు నగదును ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..ఈ నెల 25వ తేదీ నుంచి పూణేలో జరగనున్న 4వ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నాగప్రత్యూష ఎంపికైందన్నారు. ఈ పోటీలకు వెళ్లేందుకు ఆమెకు ఎమ్మెల్యే తోడ్పాటునందించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ గన్నవరం, ఉంగుటూరు మండలా పార్టీ అధ్యక్షులు పడమట సురేష్, వింత శంకర్‌రెడ్డి, పార్టీ నేతలు మేచినేని బాబు, చిమట శ్రీనివాసరావు, కై లే శివకుమార్, జలసూత్రం రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఐరన్ పోల్‌కు పెనవేసుకుపోయిన విద్యుత్ తీగలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు హైస్కూల్ రోడ్డు చివర జెడ్పీపాఠశాల సమీపంలో ఐరన్ పోల్‌కు విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ వీధి మలుపులో ఈ ఇనుప పోల్ ప్రమాదకరంగా మారింది. ఈ పోల్‌కు దట్టంగా విద్యుత్ వైర్లు పెనవేసుకుని ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంతవాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తరుచూ ఈ వైర్ల నుంచి నిప్పురవ్వలు రాలి పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అన్నీ సిమెంట్ స్తంభాలు ఉన్నాయని, జన సంచారం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో మాత్రం ఐరన్ పోల్‌ను మార్చడం లేదని ఆందోళన చెందుతున్నారు. పైగా ఈ మార్గంలో జెడ్పీ పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో ఎక్కువగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని చెబుతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ఐరన్ పోల్‌ను, పెనవేసుకుపోయిన విద్యుత్ లైన్లను మార్చాలని కోరుతున్నారు.

యనమలకుదురులో సప్త కల్యాణ మహోత్సవాలు



సప్త కల్యాణ మహోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా సప్త కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు సప్త కల్యాణ మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయ ప్రాంగణంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆలయంలో కొలువై ఉన్న శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు పాల్గొన్నారు.

సప్త కల్యాణ మహోత్సవాలు ఇలా..

కోటి ఏకలింగ మహాపుణ్య ప్రతిష్ఠ సందర్భంగా సప్తకల్యాణ మహోత్సవాలను జరుపుతున్నామని నిర్వాహకులు యు.వి.ప్రసాదరాజు, జె.శైలజ తెలిపారు. పరుశురాముడు ప్రతిష్టించిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీన ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 23వ తేదీన లక్ష్మీగణపతి హోమం, 24న సిద్ధి,బుద్ధి సమేత శ్రీ విఘ్నేశ్వర కల్యాణం, 25న వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణేశ్వర సామి కల్యాణం, 26న అనంత మహాలక్ష్మి సమేత శ్రీసత్యనారాయణ స్వామి కల్యాణం, 27న శ్రీ శివపార్వతుల కల్యాణం, 28న శ్రీ వరహాలక్ష్మినరసింహ కల్యాణం, 29న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణం, 30న శ్రీ సీతారామ కల్యాణం జరుగుతాయని వివరించారు. సప్త కల్యాణ మహోత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు.

శ్రీరామనవమికి ప్రత్యేక బస్సులు

గన్నవరం: భద్రచలంలో ఈ నెల 30న శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణానికి గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం పి.శివాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక డిపోలో ప్రత్యేక బస్సులు ఈ నెల 29వ తేదీ సాయంత్రం నుంచి భద్రచలానికి బయలుదేరుతాయని పేర్కొన్నారు. బస్ టిక్కెట్లను ఆన్‌లైన్, రిజర్వేషన్ కౌంటర్లలో ముందుగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

నున్న (విజయవాడ రూరల్): నున్న గ్రామంలోని తూర్పు రామాలయం నందు వినాయక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం సంప్రదాయ బద్ధంగా నిర్వంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన పూజ, స్వామివారికి వాస్తు పూజ, అనంతరం పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. పిమ్మట వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత భీమవరపు వెంకటరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఆలయ ధర్మకర్త భీమవరపు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణరెడ్డి, రంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొని స్వామికి పూజలు చేశారు. వల్లభాపురం జనార్ధన్ విగ్రహప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ అర్చకులు వేదాంత బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీకి తాడిగడప విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని హాసినిగీతను అభినందిస్తున్న హెచ్‌ఎం కనకదుర్గ, ఉపాధ్యాయులు

పెనమలూరు: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీకి తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికయింది. పాఠశాలకు చెందిన విద్యార్థిని తలారి హాసినిగీత మాస్కుప్రో అనే ప్రాజెక్టును రూపొందించింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపిక చేశారు. ప్రాజెక్టు వివరాల్లోకి వెళితే... నేడు మనం ప్రతి రోజు ఉపయోగించే మాస్కు వలన ఆక్సిజన్ తగ్గకుండా, వదిలే కార్బన్ డయాక్సైడ్ బయటకు వెళ్లేలా, మాస్కు వలన నీటి ఆవిరి కళ్ల జోడుపై పడకుండా ఉండే విధంగా ఇబ్బందులు తొలగటానికి నాణ్యమైన మాస్కును(మాస్కుప్రో) హాసిని గీతిక తయారు చేసింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని హాసినిగీతికను, గైడ్ మాగంటి శ్రీనివాసరావును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ అభినందించారు.

మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు నివారించండి



పెదపులిపాకలో పొలంబడి నిర్వహిస్తున్న ఏవో కనకమేడల శైలజ

పెనమలూరు: మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు ఆశించిందని, రైతులు సకాలంలో స్పందించి కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. పెదపులిపాక గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పంటకు ఆశించిన కత్తెర పురుగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు చాలా ప్రమాదకరమైందని, దీనిని సకాలంలో నివారించకపోతే పంటకు నష్టం కలుగుతుందని వివరించారు. పురుగు నివారణకు చేపట్టాల్సిన వివరాలు, ఉపయోగించాల్సిన రసాయన మందులు, తగిన సూచనలు గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు అందిస్తారన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి వీఏఏల సూచనలు పాటించాలని చెప్పారు.

నేడు లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ మీట్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాల్లో ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ చలసాని రీజియన్ మీట్ నిర్వహిస్తున్నామని ఆ రీజియన్ చైర్‌పర్సన్ చలసాని అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా, లయన్స్ జిల్లా గవర్నర్ శ్రీకాంతి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమి పూజ

రూ.4 కోట్లు విరాళం ఇచ్చిన వెలగపూడి ఉమామహేశ్వరరావు దంపతులు

పెనమలూరు: యనమలకుదురులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు శనివారం భూమి పూజ చేశారు. యనమలకుదురులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వెలగపూడి ట్రస్టు ఆధ్వర్యంలో వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల కుటుంబ సభ్యులు భవన నిర్మాణానికి అయ్యే వ్యయం రూ.4 కోట్లు విరాళం ఇవ్వటానికి ముందుకు వచ్చారు. దీంతో ప్రభుత్వం దాదాపు 32 సెంట్ల భూమి యనమలకుదురు పాత పంచాయతీ ప్రాంతంలో కేటాయించింది. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి భవనం ఆరు నెలల్లో పూర్తి చేయటానికి కృషి చేస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యనమలకుదురులో ఏర్పాటు చేయటం వలన పరిసర ప్రాంతాల్లో నివశిస్తున్న పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తా



సుశీల్‌కుమార్‌ను ఆత్మీయంగా సత్కరిస్తున్న నరసింహారావు, బాలాజీకుమార్, ఇతర సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం ద్వారా కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని గాయకుడు సంగీత దర్శకుడు డాక్టర్ సుశీల్ కుమార్ తెలిపారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సాంస్కృతిక శాఖ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆత్మీయ సత్కార కార్యక్రమం, సినీ సంగీత విభావరి శనివారం నిర్వహించారు. సత్కారం అనంతరం ఆయన మాట్లాడుతూ కళాకారుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సీనియర్ గాయకుడు బాలాజీకుమార్ సుశీల్ కుమార్ సాంస్కృతిక సేవలను వివరించారు. ప్రభుత్వం కళాకారుల కోసం పని చేస్తునట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు చేతులమీదుగా డాక్టర్ సుశీల్‌కుమార్‌ను సత్కరించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు రసూల్‌బాబు, వాసిరెడ్డి శ్రీనివాస్, భారతి, విష్ణుప్రియ, సింధూ దర్శకుడు వంశీ దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

కంకిపాడు: పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులను శనివారం నిర్వహించారు. తాహెరా సుల్తానా మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలన్నారు. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని విద్యావిషయక అంశాలను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవాడలో భారత్ గౌరవ్ రైలుకు ఘన స్వాగతం



విజయవాడ రైల్వే స్టేషన్లో భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక, పర్యాటక ప్రదేశాలను దేశ నలుమూలలకు విస్తరించేలా రైల్వే మంత్రిత్వశాఖ భారత్ గౌరవ్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో దేశంలోని ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు, చారిత్రక, పర్యాటక ప్రదేశాలను దర్శించుకునేలా 'పుణ్య క్షేత్ర యాత్ర పూరి, కాశి, అయోధ్య' ప్రత్యేక పర్యటక రైలును మొట్టమొదటి సారిగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ రైలును శనివారం సికింద్రాబాద్‌లో రైల్వే అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ రైలు విజయవాడకు సాయంత్రం 6 గంటలకు చేరుకోగా సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, ఇతర అధికారులు రైలుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రైల్లోని యాత్రికులను పలకరించి ఈ యాత్ర తమ జీవితంలో చిరస్మరణీయ ప్రయాణంగా గుర్తుండిపోవాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల సౌకర్యం దక్షిణ మధ్య రైల్వే లోనే మొదటిసారిగా ఈ రైలును రైల్వేశాఖ ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో 700 మంది యాత్రికులు రిజర్వ్ చేసుకోగా అందులో విజయవాడ నుంచి 76 మంది యాత్రికులు రైలు ఎక్కారన్నారు. 8 రాత్రుళ్లు, 9 పగళ్లు సాగే ఈ ప్రయాణంలో ఉదయం కాఫీ, అల్పాహారం, భోజనంతో పాటు సందర్శన ప్రదేశాలకు రోడ్డు మార్గంలో రవాణ సదుపాయం, యాత్రికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సెక్యూరిటీ, సీసీ కెమేరాలు, గైడ్‌లు తదితర ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ప్రయాణికుల నుంచి వస్తున్న డిమాండ్‌ను బట్టి ఇదే ప్యాకేజీతో ఏప్రిల్ 18న మరో రైలును నడపనున్నట్లు తెలిపారు.

జగనన్న భూహక్కు సర్వే సమర్థంగా నిర్వహించాలి

పెనమలూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టనున్న రీ సర్వే ప్రక్రియ సమర్థంగా చేపట్టాలని మండల తహసీల్దార్ టీవీ సతీష్ అన్నారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గ్రామ రెవెన్యూ అధికారులకు, సర్వేయర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ సర్వే సమయంలో గ్రామంలో ప్రతి సర్వే నంబరు పరిశీలించాలన్నారు. రైతుల వద్ద దస్తావేజులు తీసుకొని రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వివాదాలు, ఇతర విషయాల్లో కోర్టు కేసులు విచారణ నివేదికలు త్వరితగతిన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇక ఓటర్లు తమ ఓటుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో పనులు ఎప్పటికప్పుడు సిబ్బంది జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఉప తహసీల్దార్‌లు శ్రీనివాసరావు, అనిల్, సర్వేయర్ శివరామకృష్ణ, ఆర్ఐ భరద్వాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: ఆఫీసుకు వెళ్లిన భర్త అదృశ్యమయ్యాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి క్లాసిక్ అపార్టుమెంట్‌లో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న నల్లి ప్రసాద్ భార్య నల్లి కృష్ణకుమారితో కలిసి ఉంటున్నాడు. అతను విద్యుత్ శాఖలో పని చేస్తున్నాడు. ప్రసాద్ ఈ నెల 16వ తేదీన గుణదల ఆఫీసుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. భార్య ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

టిప్పరు ఢీకొని వృద్ధుడు మృతి

గన్నవరం: టిప్పరు లారీ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కేసరపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని సవారిగూడెం గ్రామానికి చెందిన పామర్తి వెంకటేశ్వరరావు (75) వ్యక్తిగత పనుల నిమిత్తం సాయంత్రం టీవీఎస్ మోపెడ్‌పై కేసరపల్లి వెళ్లాడు. తిరిగి గ్రామానికి వెళ్తున్న సమయంలో సవారిగూడెం రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు దాటిన తర్వాత వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ వెనుక టైర్లు వెంకటేశ్వరరావుపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు కుమారుడు శ్యాంబాబు ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.